క్లుప్తంగా

నేడు జోన్-3 పునఃరూపకల్పన సమావేశం

ఆరిలోవ: జీవీఎంసీ జోన్-3 పరిధి పునఃరూపకల్పన ప్రతిపాదనల కోసం ఈ నెల 15న ఆశీలమెట్ట వద్ద గల జోన్-3 కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు జోన్-3 జెడ్సీ శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో జోన్-3 పరిధిలో పరిపాలన సౌలభ్యం కోసం పునఃరూపకల్పన చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, పలు రంగాలలో అనుభవజ్ఞులైన పౌరుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎంవీపీకాలనీ : వెంకోజీపాలెంలో గత నెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కర్రి లక్ష్మణరావు (39) చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనకాపల్లి పట్టణం గవరపాలేనికి చెందిన లక్ష్మణరావు పనిమీద ఎండాడ వెళ్లి విశాఖ వస్తుండగా ఆటో వెంకోజీపాలెం కూడలి వద్ద ప్రమాదానికి గురైంది. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో ఈ ప్రమాదం జరగ్గా లక్ష్మణరావు కాలు విరిగిపోవడంతో పాటు అనేక గాయాలయ్యాయి. దీంతో అతన్ని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతని సోదరుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యంపై కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. జె.స్వాతి అనే మహిళ భర్తతో గొడవపడి రామ్‌నగర్ ప్రాంతంలోని ఆమె తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. అయితే, మంగళవారం బయటికి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇంట్లో, నగరంలోని పలు ప్రాంతాల్లో వెదికినా ఆచూకీ లభించకపోవటంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అతిథి అధ్యాపకులకు నెలవారీ వేతనాలు ఇవ్వాలి



వీసీకి అభినందనలు తెలుపుతున్న అతిథి అధ్యాపకులు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీకి జీతాలు పెంచినట్లు ఏయూలో అతిథి అధ్యాపకులకు కూడా యూజీసీ నిబంధనల మేరకు నెలవారీ వేతనాలు ఇవ్వాలని అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు వీసీని కోరారు. ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్ ఎక్స్‌లెన్స్ పురస్కారం అందుకున్న సందర్భంగా అతిథి అధ్యాపకులు వీసీని బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వీసీ సానుకులంగా స్పందించారని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని వారు తెలియజేశారు. వీసీని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు సురేష్ మీనన్, ప్రసాద్, శిరీష్, దాస్ తదితరులున్నారు.

దోపిడీ దొంగ అరెస్ట్

- పరారీలో మరొకరు

మర్రిపాలెం: ఆటోలో కూర్చుని ఉన్న ఓ వ్యక్తిని కొట్టి అతని వద్ద నుంచి నగదు లాక్కున్న ఘటన కంచరపాలెం క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో కంచరపాలెం పద్మశ్రీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఒక ఆటోలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి కూర్చుని ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి సదరు బాధితుడిని కొట్టి చేతులు పట్టుకుని అతని ఫ్యాంట్ జేబులో ఉన్న రూ.1700 నగదు లాక్కున్నారు. అనంతరం అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కోవడానికి ప్రయత్నించారు. అతడు ఫోన్‌ను గట్టిగా పట్టుకోవడంతో వారిద్దరూ అక్కడి నుండి నగదు తీసుకుని పారిపోయారు.

సదరు బాధితుడు మరుసటి రోజు అంటే ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో క్రైం సీఐ ఎస్. శ్రీనివాసరావు నేతృత్వంలో స్పెషల్ టీంను ఏర్పాటు చేసి వారిని గాలించగా ఇటీవల ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న దమరసింగి మోహన్ కన్నా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడే దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. అతడి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా సదరు నిందితుడు మోహన్‌కన్నాపై గతంలో కంచరపాలెం స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు తెలిపారు. ఇతడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు పేర్కొన్నారు.

మసకబారిన మత్స్యకన్యలు



బీచ్‌లో ఉన్న మత్స్యకన్యల శిల్పాలు

సాగర తీరంలో పర్యాటకులను అమితంగా ఆకట్టుకొనే మత్స్యకన్యల ప్రాంగణం తన ప్రాభవాన్ని కోల్పోతోంది. ఆర్కే బీచ్‌కి చేరువలో ఉన్న ఈ ప్రాంగణంలో నిత్యం పర్యాటకులు ఫొటోలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు. గతంలో ఈ శిల్పాల చుట్టూ ఉన్న కొండలపై నుంచి నీరు జారుతున్నట్టుగా ఫౌంటెన్ వంటివి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి మూలకు చేరాయి. విగ్రహాల వెనుక భాగంలో నీటిని సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన పైపులు సైతం చోరులపాలయ్యాయి. దీనిని పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, నీరు ప్రవహించే విధంగా చేయడం, ఈ ప్రాంతలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. దీనిని పూర్తి స్థాయిలో ఆధునికీకరించి, మరింత ఆహ్లాదంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు దృష్టిసారించాలని పర్యాటకులు కోరుతున్నారు.

- ఏయూక్యాంపస్



బోర్డులు పోగా మిగిలిన సామగ్రి



చోరుల పాలయిన నీటి పైపులు

రాజమాణిక్యం రచనలు స్ఫూర్తిదాయకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.రాజమాణిక్యంను ఏపీపీఎస్సీ చైర్మన్ ఏ.ఆర్.అనురాధ అభినందించారు. రాజమాణిక్యం రచించిన 'షాడోస్ టు స్పాట్‌లెట్'(ద రైజ్ ఆఫ్ దళిత్ వాయిసెస్) పుస్తకాన్ని ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధ చేతుల మీదగా బుధవారం విజయవాడలో ఆవిష్కరింపజేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరాన్ని ఆచార్య రాజమాణిక్యం వెలుగులోకి తీసుకొచ్చేలా చేసిన రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. గుర్రం జాషువా, రంగనాయకమ్మ రచనలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యా బోధనలో ఉంటూనే, సమాజహితం కోరుతూ ఇలాంటి పుస్తకాలను రాయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ గుజ్జు చెన్నారెడ్డి, యోగి వేమన వర్సిటీ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ రామ్‌ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెయిరీఫారం వద్ద ప్రమాదకరంగా గెడ్డ

రక్షణ గోడ నిర్మాణంపై స్థానికుల విజ్ఞప్తి



డెయిరీఫారం వద్ద రక్షణ గోడ లేని గెడ్డ అంచు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పరిధి పాత డెయిరీఫారం వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న గెడ్డ ప్రమాదకరంగా మారింది. డెయిరీఫారం కూడలి నుంచి ఇందిరానగర్ వెళ్లే మార్గంలో, సర్వీస్ రోడ్డుకు అతి సమీపంలో సుమారు 8 అడుగుల లోతులో ఈ గెడ్డ ఉంది. సుమారు 400 మీటర్ల పొడవునా గెడ్డ అంచున ఎటువంటి రక్షణ గోడ లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. నివాసితులు, అపార్ట్‌మెంట్లలో నివసించే వారి వాహనాలతో పాటు ఇతర వాహనాలు కూడా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. రక్షణ గోడ లేకపోవడంతో, వాహనచోదకులు అదుపుతప్పి ఈ గెడ్డలో పడి ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రాణనష్టం జరగకముందే జీవీఎంసీ అధికారులు అప్రమత్తమై..గెడ్డకు ఇరువైపులా పటిష్టమైన రక్షణ గోడలను నిర్మించాలని కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌పైనే వాహనాల పార్కింగ్

సందర్శకులు, వాకర్స్ అవస్థలు



ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో సాయంత్రం వేళ కాస్త సేదతీరడానికి, వాకింగ్‌కు వచ్చే నగర వాసులకు ఫుట్‌పాత్‌లపై వాహనాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఆర్.కె బీచ్‌కు చేరువలో విశ్వప్రియ ఫంక్షన్ హాల్ బయట ఫుట్‌పాత్‌లపై భారీగా వాహనాలను నిలిపేస్తున్నారు. దీంతో ఫుట్‌పాత్‌పై నడిచే పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. వేసవి సీజన్ కావడంతో సాయంత్రం వేళ వేలాది మంది పర్యాటకులు, నగరవాసులు కుటుంబాలతో కలిసి వస్తున్నారు. దీని కారణంగా బీచ్ రోడ్డులో రద్దీ అధికంగా ఉంటోంది. విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఒక ఎగ్జిబిషన్‌ను సందర్శించడానికి వచ్చే సందర్శకులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌పై నిలుపుతున్నారు. దీంతో ఇవి ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారాయి. వాస్తవానికి ఫంక్షన్ హాల్ లోపల ప్రత్యేకంగా పార్కింగ్ సదుపాయం ఉంది. దీనిని వినియోగించకుండా ఫుట్‌పాత్‌పైనే వాహనాలను నిలిపేస్తున్నారు. నిర్వాహకులు సైతం కొంత చొరవ చూపి వాహనాలను లోపల పార్కింగ్ చేసే విధంగా చూడాల్సిన అవసరం ఉంది. ఎగ్జిబిషన్‌కు సంబంధించిన స్టాల్స్ సైతం రోడ్డుపై నుంచి కనిపించడానికి వీలుగా రహదారికి దగ్గరలో నిర్మించారు. దీంతో వాహనదారులు ఫుట్‌పాత్‌పైనే వాహనాలను పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఫుట్‌పాత్‌లు ఖాళీ లేకపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు దీనిపై దృష్టి సారించాలని వాకర్స్, సందర్శకులు కోరుతున్నారు.

డైట్‌కు ఎసరు!



ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ఖాళీ స్థలంలో తైక్వాండోలో శిక్షణ పొందుతున్న బాలబాలికలు



తోటగరువు హైస్కూల్ గ్రౌండ్‌లో పిల్లలకు బాక్సింగ్‌లో తర్ఫీదు ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్



తోటగరువు హైస్కూల్ గ్రౌండ్‌లో బాస్కెట్ బాల్‌లో శిక్షణ పొందుతున్న పిల్లలు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో కానరాని డైట్

ఆరిలోవ : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోను, ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద ఖాళీ స్థలంలో ఈనెల 5వ తేదీ నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. తోటగరువు హైస్కూల్ మైదానంలో కబడ్డీ, కరాటే, బాక్సింగ్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో సుమారు 200 మంది పిల్లలు శిక్షణ పొందుతుడగా, ఆరిలోవ కాలనీ వద్ద సుమారు 100 మంది పిల్లలు, తైక్వాండో, జూడోల్లో శిక్షణ పొందుతున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఇక్కడ శిక్షణ పొందుతున్న పిల్లలకు డైట్‌లో భాగంగా పాలు, కోడి గుడ్లు, బిస్కెట్లు జీవీఎంసీ ఇవ్వడంలేదు. దీంతో పిల్లలు ఆసక్తి తగ్గిపోతుంది. దీన్ని గమనించిన కోచ్‌లు పిల్లలకు డైట్ అందించడానికి నానా తంటాలు పడుతున్నారు. దాతలను వెతుకుతున్నారు. తోటగరువు హైస్కూల్ మైదానంలో శిక్షణ పొందుతున్న పిల్లలకు హెల్త్‌సిటీ ఆపోలో ఆస్పత్రి నిర్వాహకులు, ఆరిలోవ సీఐ ముందుకు వచ్చి రోజూ అంబలి, బిస్కెట్లు అందిస్తున్నారు. ఆరిలోవ కాలనీ వద్ద శిక్షణ పొందుతున్న పిల్లలకు రోజుకో దాత ముందుకు వస్తూ డైట్ అందిస్తున్నారు. దీంతో జీవీఎంసీ పాలకులు, అధికారులపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి నేతలు మేయర్ పదవిని సొంతం చేసుకోవడానికి పెట్టిన దృష్టి పిల్లలకు శిక్షణలో భాగంగా అందించాల్సిన డైట్‌లో చూపడంలేదని ఆరోపిస్తున్నారు.

సైన్స్ మ్యూజియం.. పునాదులకే పరిమితం!



కైలాసగిరి కొండపై సైన్స్ మ్యూజియం నిర్మాణం కోసం వేసిన పునాదులు

ఆరిలోవ: నగరానికి తలమాణికంగా నిలవాల్సిన కైలాసగిరిపై వీఎంఆర్‌డీఏ చేపట్టిన సైన్స్ మ్యూజియం నిర్మానంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్తంగా మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో ఇక్కడ అధునాతనమైన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత ఏడాది జనవరి 2న అప్పటి ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అప్పటి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ అధికారులతో కలసి శంకుస్థాపన చేశారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో దీని నిర్మాణానికి రూ.4.69 కోట్లు కేటాయించారు. శంకుస్థాపన అనంతరం పనులు చకచకా చేపట్టారు. పనులు ప్రారంభించిన సుమారు నాలుగు నెలల్లోనే స్థలాన్ని చదును చేయించి పునాదులు, ప్లాట్‌ఫారం నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. మ్యూజియం నిర్మాణం పూర్తయితే 3డీ ఆర్ట్ గ్యాలరీ, సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు, శాస్త్రీయ థీమ్‌లు పర్యాటకులకు అందుబాటులోకి వచ్చేవి. కూటమి ప్రభుత్వ తీరుతో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ప్రశ్నార్థకంగా మారింది. పర్యాటకులకు విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచాల్సిన ప్రతిష్టాత్మకమైన ఈ మ్యూజియం అందని ద్రాక్షగా మిగిలిపోనుందని నగరవాసులు చెప్పుకుంటున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అధికారుల తనిఖీలు



సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జీవీఎంసీ అధికారులు

తాటిచెట్లపాలెం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ అధికారులు బుధవారం జోన్-3 పరిధిలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చైతన్యనగర్, సీతమ్మధార రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న పలువురు వ్యాపారులకు అపరాధ రుసుము విధించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఎస్ఎస్ సత్యనారాయణ, శానిటేషన్ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన మబ్బులు



నగరంలో బుధవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా మబ్బులు కమ్మేశాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గి, శీతల గాలులు వీచాయి. మధ్యాహ్నం ఉక్కపోతతో సతమతమైన నగరవాసులకు కాస్త ఉపశమనం కలిగించింది. సాగరతీరం నగరవాసులు, పర్యాటకులతో సందడిగా మారింది.

- ఏయూక్యాంపస్

ఎర్నిమాంబ వార్షిక జాతరకు ఏర్పాట్లు



అమ్మవారి జాతర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో సురేష్‌బాబు తదితరులు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతరకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్. సురేష్ బాబా తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలు ఈ నెల 14 నుండి 18 వరకు శోభాయమానంగా జరుగుతాయని, పందిరిరాటతో అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాలు మొదలైనట్లు తెలిపారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు అచ్చియ్యమ్మపేట, జ్ఞానాపురం గ్రామాల ప్రజలచే అమ్మవారికి నీలధార సమర్పణ జరుగుతుందని, సాయంత్రం 5 గంటల నుంచి హరికథా కాలక్షేపం ఉంటుందన్నారు. 16వ తేదీ అమ్మవారికి మూలమంత్ర హవనములు, సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. 17వ తేదీ తొలేళ్ల ఉత్సవంలో అమ్మవారి ప్రతిమలను పూర్ణామార్కెట్ సమీపంలోని దుర్గాలమ్మ గుడి నుండి కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, కాన్వెంట్ కూడలి మీదుగా జ్ఞానాపురంలో గల అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొస్తామని చెప్పారు. 18న జరిగే ప్రధాన జాతరలో ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, విశేష కుంకుమార్చన, వివిధ పుష్ప జాతులతో అలంకరణ, ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అమ్మవారి జాతర ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, అర్చకులు శ్రీకాంత్‌శర్మ, పూజారి వాసుపల్లి విజయమ్మ, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం కోరుతూ 16న బైక్ ర్యాలీ

దాబాగార్డెన్స్: అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన మే 20వ తేదీ అఖిల భారత సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 16న బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. మన్మథరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సమ్మెను విశాఖ కార్మికవర్గం జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

జాగ్రత్తలతోనే వడదెబ్బ నుంచి రక్షణ



మాట్లాడుతున్న జాయింట్ లేబర్ కమిషనర్ రామారావు

సీతంపేట: తీవ్రమైన ఎండల కారణంగా కార్మికులు వడదెబ్బకు గురి కాకుండా పరిశ్రమల యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు తెలిపారు. అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో బుధవారం పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక కమిషనర్ జారీ చేసిన సూచనల మేరకు కార్మికులు వడదెబ్బ బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో భాగంగా కార్మికులకు ఎండ, వడగాల్పుల నుంచి రక్షణకు పాద రక్షలు, టోపీలు అందజేయాలని సూచించారు. అలాగే సీఎస్ఆర్ ఫండ్ కింద ఫ్యాక్టరీ గేటు ముందు ఉచిత మజ్జిగ, తాగునీటి సదుపాయం కల్పించాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యలతో కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్, లారస్ ల్యాబరేటరీస్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏవీఎన్‌లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం



సివిల్ డిఫెన్స్‌పై తర్ఫీదు ఇస్తున్న 3వ ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ సబ్ లెఫ్టినెంట్ అరవింద్



శిక్షణకు వచ్చిన మహిళా క్యాడెట్లు

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో 3వ ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ వార్షిక (యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు) శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు సహాయ సహకారాలతో ఈ క్యాంపు ఈ నెల 22 వరకు నిర్వహించనున్నారు. 10 రోజుల కాల వ్యవధిలో క్యాడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వం, సేవా విలువలు పెంపొందించేందుకు శిక్షణ తోడ్పడుతుంది. మూడేళ్ల ఎన్‌సీసీ ట్రైనింగ్‌లో శారీరక శిక్షణ, సీమెన్‌షిప్, వాటర్‌మెన్ షిప్, డ్రిల్, ఫైరింగ్, సివిల్ డిఫెన్స్‌లో తర్ఫీదు పొందనున్నారు. అంతే కాక నేవల్ సర్వీస్ సబ్జెక్టులు, అత్యవసర వైద్య సేవలు, సైబర్ సెక్యూరిటీపై అవగాహన, సామాజిక సంక్షేమ కార్యకలాపాలపై గ్రౌండ్ క్లాసులు నిర్వహించనున్నారు. ఐక్యత.. క్రమశిక్షణకు అనుగుణంగా క్యాడెట్ల శారీరక ఓర్పు, మానసిక స్థితి, పౌర బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ సెషన్స్ ఎన్‌సీసీ ప్రధాన నినాదంతో సాగుతాయని 3వ ఆంధ్రా నేవల్ యూనిట్ ఎన్‌సీసీ సబ్ లెఫ్టినెంట అరవింద్ తెలిపారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమకారుడు దత్తి అప్పలనాయుడు బుధవారం పాల్గొని పుస్తక పఠనం పట్ల అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు దోహదపడతాయన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అవసరానికి మించి వాడకూడని చెప్పారు. తెలుగు పద్య పఠనంలో ఉన్న గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. పద్య పఠనంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.